ఇటు వర్షం.. అటు గౌతమి ఉధృతి


కపిలేశ్వరపురం ఎస్సీ ఏరియాలోని ఓ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ మెట్లను తాకిన వరద నీరు


కేదారిలంక సూర్యగుండాల కాజ్‌వే వద్ద వరదనీటి ఉధృతి

- భీతి చెందుతున్న ప్రజలు, అన్నదాతలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- స్తంభించిన జనజీవనం

కపిలేశ్వరపురం: ఎడతెరపిలేని వర్షం, గౌతమి గోదావరి నదిలో పెరుగుతున్న వరద ఉధృతి తీర ప్రాంత వాసులను, రైతులను కలవర పెడుతోంది. మండలంలోని 19 గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి తీర ప్రాంతాల్లో బుధవారం వరద భయం అలుముకుంది. కపిలేశ్వరపురం, తాతపూడి, వాకతిప్ప, కోరుమిల్లి పుష్కర ఘాట్ల మెట్లను వరదనీరు తాకింది. నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో గ్రామాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కొండలరావు, తహసీల్దార్ చిన్నారావు ఆదేశించారు. అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఇటీవల వరద ప్రభావానికి తీవ్రంగా నష్టపోగా మరోసారి వరద పెరుగుతుండంతో లంక గ్రామాల ప్రజల్లో భయం వెంటాడుతోంది. కపిలేశ్వరపురం ఎస్సీ ఏరియా డ్రెయిన్ వర్షపు నీటితో నిండింది. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయినట్టు గుర్తించిన కార్యదర్శి శివ చక్రవర్తి పారిశుధ్య చర్యలు చేపట్టారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, నల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, నేలటూరు, వల్లూరు, కాలేరు, టేకి, నాగులచెరువు తదితర గ్రామాల్లోని శివారు వ్యవసాయ క్షేత్రాలు ముంపు బారినపడ్డాయి. వర్షాలకు చిరు వ్యాపారులు ఇళ్లకే పరిమితం అయ్యారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. వెదురుమూడి, అంగర, కపిలేశ్వరపురం, నేలటూరు గ్రామాల పరిధిలోని రహదారి ఛిద్రం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రాయవరంలో భారీ వర్షం

రాయవరం: మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ మండలంలో భారీ వర్షం కురిసింది. వర్షాలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కాగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ మండలంలో 54.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు 13.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


రాయవరంలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

భారీ వర్షం


కాకినాడ-కోటిపల్లి మార్గంలో జలమయమైన రహదారి

కాజులూరు: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో బుధవారం కాజులూరు మండల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం వరకూ ఎకధాటిగా కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఆపై కొంత సమయం తెరిపిచ్చినప్పటికీ సాయంత్రం వరకూ చెదురుమదురుగా జల్లులు పడుతూ వచ్చాయి. దీంతో గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వర్షపు నీరు చేరి జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలోనూ తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తాయి.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు


వర్షాలకు కూలిన గన్నిమ్మ పెంకుటిల్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో కొండేటి గన్నిమ్మకు చెందిన పెంకుటిల్లు వరుసగా కురుస్తున్న వర్షాలకు బుధవారం కూలిపోయినట్లు గ్రామ వీఆర్వో దంగేటి నరేష్‌కుమార్ విలేకరులకు తెలిపారు. ఆమె ఒంటరిగా ఉంటోంది. ప్రమాద సమయంలో అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. పూర్తి వివరాలను తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు పూర్తి నివేదిక అందజేసినట్లు తెలిపారు.

వరదపై సమీక్ష


కోటిపల్లి రేవు వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కె.గంగవరం: మండలంలోని గోదావరి తీర గ్రామాల్లో వరద పరిస్థితిపై తహసీల్దార్, ఎంపీడీఓలు సమీక్షించారు. కోటిపల్లి రేవు వద్ద వరద పరిస్థితిని వారు పరిశీలించారు. భద్రాచలంలో వరద పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ మేరకు గ్రామ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారి వెంట కార్యదర్శి పలివెల మూర్తి, వీఆర్వో కృష్ణ సాయి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురి ఎంపిక


పంపన కృష్ణమూర్తి


చింతా నారాయణమూర్తి


వై శ్రీనివాసరావు


సాంసన్


కేవీఎస్ఎస్‌జేబీఎల్ రత్నం


వైవీవీఎస్ఎల్ సూర్యకుమారి


బంటుమిల్లి ఆదిలక్ష్మి


శంకరరామం


సంబర వేణు


రామచంద్రారెడ్డి


డి.సత్తిరాజు


కుక్కల శ్రీనివాస్


బి.పి.రామకృష్ణ


మేడిశెట్టి సత్యనారాయణ


లీలాకుమారి

కాజులూరు: ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కాజులూరు మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు ఎంఈఓ డేవిడ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, స్కూల్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి, పెనుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.శ్రీనివాసరావు, కుయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శాంసన్‌లను మండల గ్రామాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారన్నారు. ఐదో తేదీ గురువారం గురుపూజోత్సవం నాడు కాకినాడలో జిల్లా అధికారుల సమక్షంలో వీరికీ అవార్డులు ప్రదానం చేస్తూ ఘనంగా సత్కరిస్తారన్నారు.

రామచంద్రపురం రూరల్/కె.గంగవరం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ ఏడాది మండలం నుంచి ముగ్గురూ మహిళా ఉపాధ్యాయులు ఎంపికవడం విశేషం.మండలంలోని వెలంపాలెం ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శ్రీకాకుళపు వెంకట సత్యసూర్యజానకిభాగ్యలక్ష్మి రత్నం(రత్నం మేడం), తాళ్లపొలం ఎంపీయూపీ పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యర్రంశెట్టి వీరవెంకట సత్యలక్ష్మి సూర్యకుమారి, రామచంద్రపురం అర్బన్ శ్రీలాల్‌బహదూర్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తున్న బంటుమిల్లి ఆదిలక్ష్మి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరు ముగ్గురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను గెలుచుకున్నారు. అలాగే కె.గంగవరం మండలం దంగేరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరామం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు.

మండపేట నుంచి ఇద్దరు..

మండపేట: పట్టణానికి చెందిన ఇద్దరు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈఓ నాయుడు రామచంద్రరావు బుధవారం తెలిపారు.మండలంలోని వెలగతోడు ప్రాథమిక పాఠశాల సెంకండరీ గ్రేడ్ టీచర్ సంబర వేణుగోపాల్, పట్టణంలోని గౌతమి మున్సిపల్ పాఠశాల్లో పనిచేస్తున్న పడాల రామచంద్రారెడ్డి ఈ పురస్కారాలు లభించాయన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమలాపురంలో నిర్వహించే వేడుకల్లో వారు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటారని ఎంఈఓ తెలిపారు.

రాయవరం: మండలం నుంచి నలుగురు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గెజిటెడ్ హెచ్‌ఎం విభాగంలో వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.సత్తిరాజు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచర్ కుక్కల శ్రీనివాస్ ఎంపికయ్యారు. పీజీటీ కేటగిరిలో రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిషు ఉపాధ్యాయుడు బీపీ రామకృష్ణ ఎంపికయ్యారు. ఎస్‌జీటీ కేటగిరీలో మాచవరం నంబర్-1 ప్రాథమిక పాఠశాల్లో పని చేస్తున్న మేడిశెట్టి సత్యనారాయణ అవార్డు దక్కించుకున్నారు. వారిని ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ అభినందించారు.

వల్లూరులో

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు ఎంపీపీఎస్ 1 పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు టి.లీలా కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. లీలాకుమారిని ఎంఈఓ కె.తాతారావు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంతుచర్మాల నిల్వ

మండపేట: న్యూకాలనీ ప్రకాశం మున్సిపల్ స్కూల్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు జంతు చర్మాలు నిల్వ ఉంచారు. వీటిని చూసి విద్యుత్ ఉద్యోగులు అవాక్కయ్యారు. ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ చొల్లంగి శ్రీధర్ ఆదేశాల మేరకు పట్టణంలో బుధవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టడానికి వెళ్లిన విద్యుత్ ఉద్యోగులు ఈ విషయాన్ని గుర్తించి ఏడీఈకి తెలియజేశారు. దీంతో ఏడీఈ శ్రీధర్‌కు సిబ్బంది తెలియపరచగా అసహనం వ్యక్తం చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ ఉద్యోగులు ప్రజలకు నిరంతరం పవర్ సప్లయి ఇవ్వడానికి ఎలాంటి ఆటంకం రాకుండా శ్రమిస్తుంటే కొంత మందికి పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీధర్ హెచ్చరించారు. కాగా గొల్లపుంత, న్యూ కాలనీ, సత్యశ్రీ రోడ్డు, బురుగుంట చెరువు తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో లైన్‌మన్, ప్రైవేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుపాకలో వైరల్ జ్వరాలు


వెదురుపాక శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన వివాహిత సలాది సంతోషిమాత ఇటీవల మృతి చెందడంతో ప్రజల్లో డెంగీ జ్వరాలపై ఆందోళన నెలకొంది. దాంతో రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు బుధవారం వెదురుపాకలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు 110 మందికి పరీక్షలు నిర్వహించారు. మృతురాలు సంతోషిమాత కుమారుడు సూర్యతేజకు కూడా డెంగీ రాపిడ్ కిట్, మలేరియా పరీక్షలు నిర్వహించారు. అయితే అతడికి నెగటివ్ వచ్చినట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రాంతంలో 30 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను వైద్యసిబ్బంది పర్యవేక్షించారు.

ద్రాక్షారామ సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ప్రధాన సమస్యలైన డంపింగ్ యార్డు, ఆక్రమణల తొలగింపు, మార్కెట్ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సర్పంచ్ కొత్తపల్లి అరుణ బుధవారం వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే ఆర్డీఓకు ఫోన్ చేసి ద్రాక్షారామ సమస్యలపై విచారణ చేసి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారని సర్పంచ్ తెలిపారు.

విగ్రహం ఏర్పాటుపై ద్వారపూడిలో వివాదం

- గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- ఇరువర్గాలను శాంతింపజేసిన రామచంద్రపురం ఆర్డీవో సుధాకర్

మండపేట: మండలంలోని ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అంశంపై వివాదం తలెత్తింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం రాత్రి గ్రామంలోని కొందరు ఎస్సీలు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన కొందరు ఇతర సామాజిక వర్గాల యువకులు విగ్రహం ఏర్పాటును అడ్డుకునేందుకు గుమిగూడారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పరిస్థితిని చక్కబెట్టేందుకు గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ పీతల దొరరాజు అప్రమత్తమై, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడమే గాకుండా, రూరల్ ఎస్‌ఐ డి.సురేష్‌బాబు, సిబ్బందితో కలసి సంఘటనా ప్రాంతానికి వెళ్లారు. పరిష్కార మార్గాన్ని బుధవారం ఉదయం చూద్దాం అని చెప్పి ఇరువర్గాలనూ పంపించి వేశారు. తెల్లవార్లూ గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం రామచంద్రపురం ఆర్డీవో సుధాకర్ గ్రామానికి విచ్చేసి వివాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఒక దశలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఆర్డీవో సుధాకర్ సంయమనం పాటించాలని నచ్చజెప్పడంతో సద్దు మణిగారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామపెద్దలు, పలు రాజకీయ పార్టీల ప్రముఖులతో ఆర్డీవో చర్చించారు. పది రోజుల పాటు ఇరు వర్గాల వారు మౌనంగా ఉండాలని, ఆ తర్వాత ఏం చేయాలనే దానిపై ఆలోచన చేద్దామని ఆర్డీవో చెప్పి ఇరువర్గాలను పంపించి వేశారు. కాగా బుధవారం రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ కూడా ద్వారాపూడి వచ్చారు. తహసీల్దారు తేజేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఈవోపీఆర్డీ ఐదం రాజు, రూరల్ సీఐ దొరరాజు, ఎస్‌ఐ సురేష్‌బాబు ఆర్డీవో పాటు ఉన్నారు.

పొంచి ఉన్న పెను ప్రమాదం


ఎండి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న నిద్రగన్నేరు చెట్టు కొమ్మ

రామచంద్రపురం: ప్రధాన రహదారిలో ఓ చెట్టు కొమ్మ ఎండిపోయి రోడ్డు మీద పడే విధంగా పెద్ద ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రహదారి సమీపాన బస్టాప్ వద్ద ప్రధాన రోడ్డు పక్కనే పెద్ద నిద్రగన్నేరు చెట్టు దానికి చెందిన ఒక పెద్ద కొమ్మ ఎండిపోయి ఉంది. పెద్ద కొమ్మ వర్షాలు, గాలులు వీచే సమయంలోని రోడ్డు మీద విరిగిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది.

నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు ఈ ప్రధాన రోడ్డు మీద ప్రయాణిస్తుంటారు. వీఎస్‌ఎం కళాశాల దగ్గర కావటంతో ఎంతో మంది విద్యార్థులు కూడా నడచి వెళుతుంటారు. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీగా ఉంటుంది. అయితే ఎండిపోయిన కొమ్మ ప్రమాదవశాత్తూ వాహనాల మీదగానీ, రోడ్డున వెళ్లే ప్రయాణికుల మీద కానీ పడిపోతే ప్రమాదం సంభవిస్తుంది. తక్షణం సంబంధిత అధికారులు స్పందించి ఎండిపోయిన పెద్ద కొమ్మను ఎటువంటి ప్రమాదాలు జరగకముందే తొలగించాలని పట్టణ వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న రాధాకృష్ణన్ చిత్రం


మోహన్ రూపొందించిన రాధాకృష్ణన్ చిత్రం


చిర్రా మోహన్

రాయవరం: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించుకోనున్నారు. మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చిర్రా మోహన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాన్ని చిత్రీకరించి ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

మైక్రో 'నఖ' నివాళి


బొటనవేలి గోరుపై రాధాకృష్ణన్ చిత్రం

రామచంద్రపురం రూరల్: ఉపాధ్యాయ వృత్తి నుంచి మొదలుకొని దేశ రాష్ట్రపతి వరకు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కొండంత వ్యక్తిత్వానికి గోరంత నివాళి అర్పించారు రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్. నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటాన్ని బొటనవేలి గోరుపై మైక్రో ఆర్ట్ ద్వారా ఒకటిన్నర సెంటీమీటర్ల కొలతతో వేసి అందరి అభినందనలు అందుకున్నారు.

మైనంతో సర్వేపల్లి ప్రతిమ


రాధాకృష్ణన్ మైనపు ప్రతిమ

రామచంద్రపురం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను మైనంతో రూపొందించిన ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. అతడిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు గురు పూజోత్సవానికి మంత్రి రాక

రామచంద్రపురం రూరల్: మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న గురు పూజోత్సవానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రానున్నట్లు ఎంఈవో మానుపూడి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

చవితి ఉత్సవాలకు రాట మంచి పూజలు


రాట మంచి పూజలు చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం:వినాయక చవితి ఉత్సవాలకు స్థానిక వెలంపేట రామాలయం వద్ద బుధవారం రాట మంచి పూజలు చేశారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ రాట మంచి పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల ఏడో తేదీ వినాయక చవితి నుంచి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

క్షతగాత్రురాలికి చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శ

మండపేట: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు సోదరి సంధ్యారాణిని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి బుధవారం పరామర్శించారు. సంధ్యారాణి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చైర్‌పర్సన్ వెంట కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గమ్మ, మొండి భవాని ఏఎంసీ మాజీ డైరెక్టర్లు కొప్పిరెడ్డి పద్మావతి, కనికెళ్ల పల్లవి ఉన్నారు.

వరద బాధితులకు లక్ష వాటర్ బాటిళ్లు

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి గోదావరి జిల్లాల బ్రాండ్ ×ఆర్బోస్₹ నుంచి వరద బాధితుల సహాయార్థం లక్ష వాటర్ బాటిళ్లు పంపిణీ చేసినట్లు సంస్థ యాజమాన్యం అడ్డూరి సత్య సంతోష్ బుధవారం తెలిపారు. బాధితులకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.